# నాతిగాడి కథ



ఎస్. అంజనా దేవి

అప్పుడే భోజనంముగించి కూర్చున్నాను. అబ్బబ్బ! ఒకటే ఉక్కపోస్తుంది. ఏమీతోచటంలేదు. నానిగాడు స్కూలుకు శ్రీవారు ఆఫీసుకు వెళ్ళారు. పదకొండు గంటలకే వండటం తినడంకూడా అయిపోయింది.

ఏమి చెయ్యాలి?

ఎంబ్రాయిడరీ కుట్టుకుందామా అంటే చెయ్యి నొప్పెడుతోంది. ఎంతసేపని కుట్టుకోను? తెలిసినవాళ్ళింటికి వెళుదామంటే నాకుఎవ్వరింటికీ వెళ్ళబుద్ధికాదు. ప్రొద్దస్తమానం ఏం పుస్తకాలుంటాయి? ఏమీ వ్యాపకం లేకపోతే పిచ్చిపిచ్చి ఆలోచనలతో మనుషులు పిచ్చివాళ్ళవుతారేమోననిపించింది.

ఏమివ్యాపకం పెట్టుకోవాలాఅని ఆలోచిస్తున్న నాకు నా బుల్లిబుర్రలో బుల్లి ఆలోచన తళుక్కున మెరిసింది. ఎడారిలో దప్పిగొన్నవానిమీద ఓయాసిస్సు ప్రభావంలా నా ఆలోచన నామీదమంచి ప్రభావం చూపించింది. నా బుల్లిబుర్రకు ఇంత మంచిఐడియా వచ్చినందుకు నన్నునేనే అభినందించుకున్నాను.

నేను కూడా ఒక రచయిత్రినైతే దేముడు మేలుచేసి నాకథలు అచ్చయితే పేరుకుపేరూ వస్తుంది, కాలాక్షేపానికి కాలక్షేపమూ అవుతుంది.

ఎలాంటికథ వ్రాయాలి? అన్నిటికీ క్వశ్చన్‌మార్కు ఫేస్‌పెట్టటమేమిటి? ఆలోచిస్తే ఐడియారాకపోతుందా, అని ధైర్యం తెచ్చుకున్నాను.

కుక్కపిల్ల.
సబ్బుబిళ్ళ,
అగ్గిపుల్ల!
కాదేదీ కవితకనర్హం! అని శ్రీశ్రీ చెప్పినట్లు ఏదోఒక కథావస్తువు దొరకకపోతుందా? అనుకున్నాను.

కథావస్తువు దొరికిందనుకొండి, కథ ఎలావ్రాయాలి? పదికథలు పరిశీలిస్తే కథ ఎలావ్రాయాలో తెలియకపోతుందా? అని అనుకోవటమేమిటి తక్షణమే పదిపాత పత్రికలు ముందేసుకుని ఓపికగా కథలు పరిశీలించాను. ఓస్! కథవ్రాయటం ఇంతేగదా! అని అనిపించింది.

చదివిన కథలలో "పసిమనసులు" అన్నకథ నన్నాకర్షించింది. వెంటనే ఐడియా రావటం, నా కథకు "బీదమనసులు" అనిపేరు నిర్ణయించుకోవటానికి నిముషంకూడా పట్టలేదు.

"బీదమనసులు" అనేపేరు ఎందుకు పెట్టాననుకుంటున్నారేమో, మిగతా కథ చదవండి మీకేతెలుస్తుంది.

మాకు పనిచేసే మల్లమ్మ బీదదేకదా దానిమనసు నాకు తెలిసిందేకదా! అందుకని "బీదమనసులు" అనేకథవ్రాయటం తేలికేననిపించింది.

ఒకగంటసేపు ఆలోచించి కథకు ఒక రూపం ఏర్పరచుకున్నాను. మల్లమ్మ మాట్లాడే తెలంగాణా భాష జాగ్రత్తగా గుర్తుతెచ్చుకున్నాను. ఎందుకంటె నాకథ వాస్తవానికి దగ్గరగా వుండటానికి. కథ ఏరోజు మొదలుపెట్టాలి? అసలేనాకునమ్మకాలు జాస్తి. వెంటనే తెలుగు క్యాలెం

డర్ ముందువేసుకుని కూర్చున్నాను. దేవుడిని ప్రార్థిస్తూ. మధ్యలో దేముడెందు కంటారేమో: తొందరలో మంచిరోజు కుదరకపోతే నేనుఆలోచించినకథ మర్చి పోయే ప్రమాదమున్నది. కనుక తొందర లోనే మంచిరోజు కుదరాలని దేవుడ్ని క్యాలెండర్ చూడకముందే ప్రార్థించాను

నా అదృష్టంకొద్దీ మరునాడే మంచి రోజు. గురువారం. 24వతేది. దశమిఅను రాధానక్షత్రం అన్నిదివ్యంగా ఉన్నాయని పించింది. మరునాడు ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తూ, మధ్యమధ్యలో కథ మర్చిపోకుండా గుర్తు చేసుకుంటూ ఆ రోజుగడిపేశాను.

* * *

మరునాటి ఉదయం త్వరగాలేచి త్వర త్వరగా ముగిస్తున్న నన్నుచూసి 'ఇవ్వాళ విశేషమేముందబ్బా: రోజుత్వరగా వంట చెయ్యమని గూబలు గుయ్‌మనేలా గోల పెట్టినా కించిత్ చలించని దేవిగారికిఇంత మంచిబుద్ధి ఎలా కలిగిందబ్బా? ఒకవేళ సూర్యుడు పశ్చిమాన ఉదయించలేదు కదా?" అన్న శ్రీవారి మాటలకు అడ్డు వస్తూ చిన్నగా నవ్వాను. నా తొందర వారికేమి తెలుసు?

"నా కథ 11గంటలలోగా మొదలు పెట్టాలి. లేకపోతే ఒక ప్రమాదముంది. ఏమిటబ్బా! అంతప్రమాదం అంటారేమో 11గంటలకు నానిగాడువస్తాడు. వాడువస్తే తుమ్మే ప్రమాదముంది.

పదిగంటలకు శ్రీవారు అటుఆఫీసుకు వెళ్ళటం, ఇటుతెల్ల కాగితాలు, కలం ముందుపెట్టుకుని కూర్చోవటం నిముషం పట్టింది. స్థిమితంగా కూర్చుని కాస్సేపు సిద్ధివినాయకునిప్రార్థించి కలంచేతపట్టటం వెనుకింటి పిన్నిగారు హచ్,హచ్.మని తుమ్మటం జరిగింది. ఈ హఠాత్పంఘట నకు నా బుర్రపనిచెయ్యటం మానేసింది. నిముషం ఆలోచించిన తరువాత వెనుక తుమ్ముముందుకు లాభమనే విషయం స్ఫురించింది. పైగా ఆవిడకు తుమ్ముల జబ్బు ఒకటుంది: హీనపక్షం రోజుకు 50 తుమ్ములకు పైగానే తుమ్ముతుంది,

అన్నీ మనమంచికే ననిపించింది. ఈ హడావుడిలో వెంకటేశ్వరుని ప్రార్థిం చటం మర్చిపోయాను. కాస్సేపు వెంక టేశ్వరుని ప్రార్థించి కథ వ్రాయటంమొద లుపెట్టాను. ఒకపేజీ వ్రాశానోలేదో,

"అమ్మాఆకలే" అంటూప్రవేశించాడు నానిగాడు.

"పద,పద, కాళ్ళుచేతులు కడుక్కో, అన్నం పెడతాను" కథవ్రాస్తూనే సమా ధానమిచ్చాను.

"అమ్మా ఎవరికీ ఉత్తరం వ్రాస్తు న్నావ్?"

"ఉత్తరం కాదురానానీ కథ వ్రాస్తు న్నాను" నా మాటలునాకే గర్వంగా విని పించాయి.

"కథఎవరికి వ్రాస్తున్నావే? నానిగాడి సందేహం.

"మనంపుస్తకాలు, పత్రికలు కొను క్కుంటామే, ఆపుస్తకాలు అచ్చువేసే వాళ్ళకు పంపిస్తే మనకథకూడా ఆపుస్తకాల్లో అచ్చువేస్తార్రా"

"అమ్మా మనపేరు పుస్తకంలో పడు
తుందే?"

"ఓ! దివ్యంగా పడుతుంది."

"అయితే కధకు నా పేరుపెట్టవే. నాని
గాడి అభ్యర్థన.

"ఏడిశావ్, నీ పేరు పెట్టటమేమిటి?"

"మరి ఎవరిపేరు పెడతావే అమ్మా"
"నాపేరే పెట్టుకుంటాను."

"అయితే నేనుగూడా ఒకకధ వ్రాసి
పంపిస్తాను."

"నువ్వుకధ వ్రాయటమేమిటి? నోరు
మూసుకుని పడ" విసుక్కున్నాను.

"అయితేనాన్నారు ఎప్పుడూ నీ రాత
అర్థంకాదుఅంటూ విసుక్కుంటారు కదా
మరి? పత్రికల వాళ్ళకు ఎలా అర్థమవు
తుందే?"

"నోరుమూసుకోరా గాడిదా. నీ వ్రాత
కన్నా నా వ్రాత బాగానే వుంటుందిలే"
లేనిగాడిని కసురుకున్నాను గానీ,ఆ అను
మానం నాకుగూడా వచ్చింది. నా వ్రాత
అసలు అష్టవంకర్లు ఈ అనుమానంతో
కలంముందుకి సాగలేదు. ఇప్పుడు ఏమి
చెయ్యాలి, అని ఆలోచిస్తునే నానిగాడికి
అన్నంపెట్టాను.

"అమ్మా! నాలుగవతరగతి చదివే
వాళ్ళు కధలు వ్రాయగూడదా?" నానిగా
డికి కలిగిన అనుమానం.

"వ్రాయొచ్చులేరా"

"మరిఇందాక వ్రాయగూడదన్నావే?"
నానిగాడిబుర్ర అప్పుడప్పుడూ చురుకుగా
పనిచేస్తుంది.

"ఎనిమిదేళ్ళు వచ్చాయోలేదోఅప్పుడె
ఏమి కధలు రాస్తావురా? నన్నువిసిగించక
అన్నంతిను నాకుకోపంవస్తే ఏం జరుగు
తుందో తెలుసా"

"ఓ! తెలుసు. వీపు మోగుతుంది.
అమ్మానాన్నకు నీకధ వ్రాసిపెట్టమనవే"

నానిగాడి ఐడియా బాగుంది. నాకు
నచ్చింది. వాడికిగుప్పెడు చాక్లెట్లిచ్చిబడికి
పంపించాను.

సాయంకాలం అయిదుగంటలకు రేగిన
క్రాపుతో కాళ్ళీడుచుకుంటూ వచ్చిన శ్రీవా
రికి తెల్లచీరె కట్టుకొని, మల్లెపూలుపెట్టు
కుని చిన్న చిరునవ్వుతో కాఫీకప్పు
అందించాను–

"అహ! ఇవ్వాళ ఈ దాసుడినిఇంతగా
అనుగ్రహించిన కారణంబేమై యుండును
అనిఆశ్చర్యపోతూ కాఫీకప్పు అందుకు
న్నారు శ్రీవారు.

"నాన్నోయ్, అమ్మ కధవ్రాసింది"
అప్పుడేస్నానంచేసి శుభ్రంగా తుడుచుకో
కుండానే కేకలువేస్తూ వచ్చాడునానిగాడు.

"ఇదెక్కడివింత. ఈరోజులేచినవేళా
విశేషమేమోగాని వింతలమీద వింతలు
జరుగుతున్నాయే" మరింతగా ఆశ్చర్య
పడ్డారు శ్రీవారు.

"చాల్లెండి. మీకన్నీవింతలే"

"మననెలసరి బడ్జెట్‌లో కాగితాలకి,
కలాలకి, అదనంగా ఎంతచేర్చాలో" విసు
రుగా ఇంట్లోకివెళ్ళిన నన్నుచూసి అంత
టితో ఆపేశారు.

నేను కోపగించుకుంటే అసలుకే
మోసంరావచ్చు. వెంటనే శ్రీవారిచెంతకు

చిన్నగాచేరి, నేనుకధ ఎందుకు వ్రాయా లనుకున్నానో వివరించి, కాస్సేపు బ్రతి మాలి, విసుక్కుని, ఏడ్చినంత పనిచేసి చివరకు కధ 'ఫేర్' చేసేటట్లు శ్రీవారిని ఒప్పించాను.

మరునాడు పోస్టుచెయ్యాలని ఆ రోజే కధఫేర్ చేసారు. (శ్రీవారి కష్టానికి ప్రతి ఫలం లభించిందనుకోండి)

మరునాడు ప్రొద్దున ఆఫీసుకు వెళ్ళేట ప్పుడు కధను శ్రీవారు రిజిష్టర్ పోస్టులో పంపించారు. (రిజిష్టర్ పోస్టులో ఎందు కంటారేమో కధఎక్కడన్నా మిస్ అవు తుందేమోనన్న నా భయంకొద్దీ.

ఒకవేళ కధనచ్చకపోతే తిరిగి పంపి సారుకదాఅని నెలరోజులుఎదురుచూశాను నెలరోజులవరకూ కధతిరిగి రాకపొయ్యే సరికి అచ్చువేసుకుంటారులెమ్మని ధైర్యం గా వున్నాను.

* * *

పోస్ట్ అనేపిలుపు వినంగానే మా అమ్మ దగ్గరనుంచి లెటర్ వచ్చిందేమో ననుకుంటూ నెమ్మదిగా తలుపు తీశాను. పోస్టుమెన్ నా వైపు ఒకసారి పరీక్షగా చూసి కవర్ నెమ్మదిగా చేతులోపెట్టాడు. (పోస్టుమెన్ చూసిన జాలిచూపులు తర వాత అర్ధమయినవిలెండి.)

తీరా కవర్ వైపు చూసేసరికి, క్షణం సేపు మెదడు పనిచెయ్యటం మానివేసింది.

## పిల్లికూత; కుక్క అరుపు

ఇద్దరు ప్రక్కింటివాళ్ళమధ్యసంభా షణ "ఏమండి రాత్రి చాలా సేపటి వరకు మీ యింట్లో పిల్లికూతలు వినిపించాయేమిటి? అన్నాడు ఒకా యన.

'గట్టిగా అరవకండి మా ఆవిడ నడక అలాగేవుంటుంది, మరి మి యింటినుండి కుక్కఅరుపులు విని పించాయేమిటి' అన్నాడాయన.

"మా ఆవిడ పిల్లిని తరిమేందుకు కేకలేసింది" అన్నాడు మొదటా యన.

—మాష్టార్ జీ

తిరిగివచ్చిన కధ చూడంగానే ఏడుపు వచ్చినంత పనైంది. కవర్ విసురుగా టేబుల్ పైకి విసిరి, వచ్చే దుఃఖాన్ని ఆపు కుంటూ, నాకు నేను ధైర్యంచెప్పకుంటూ పడుకున్నాను. కాస్సేపటికి వైరాగ్యం నన్నావరించింది.

సాయంకాలం ఆఫీసునుంచి వచ్చిన శ్రీవారు కాఫీ సేవించి, టేబుల్‌మీద కవర్ ఏమిటబ్బా అనుకుంటూ చేతిలోకి తీసికున్నారు. అర్ధమయింది కాబోలు కాస్సేపు నన్నుదికించబోయి,నా మొహం చూసి ఆగిపొయ్యారు.

కాస్సేపు అది,ఇది అని ధైర్యంచెప్పి "ఒకటి రెండు చెపితేగాని వైద్యుడు కాడ

న్నట్లు ఒకటి రెండు కథలు తిరిగివస్తే గాని రచయిత కారు. "అంటూ ఏమిటేమిటో చెప్పారు. మనిషికో అభిరుచి వుంటుంది. ఈ ఎడిటర్‌కి నచ్చకపోతే. నీ కథ ఇంకో ఎడిటర్‌కి నచ్చవచ్చు. ఈ సారి ఇంకో మాగ్‌జైన్‌కి పంపిద్దాములే. కథ ఇంకోసారి చదువు. ఏమైనా మార్పులు చేయవచ్చేమో చూద్దాం, అంటూ శ్రీవారు కవరుతీసి చూశారు.

"దేవి, ఒకసారి ఇటురా!"

ఏమిటబ్బా ఇంత పెద్దగా పిలిచారు అనుకుంటూ వెళ్ళాను. కాగితాలు చూసి అలా తెల్లబోతున్నారేమిటబ్బా అనుకుంటూ పక్కకెళ్ళి చూశాను.

"నానిగా!" అనుకోకుండానే చిన్న సైజు కేకపెట్టాను.

వీధిలో ఆడుకుంటున్న నానిగాడు పరిగెత్తుకుంటూ రావటం, వాడి వీపుమీద నా ఐదువేళ్ళు ముద్రపడటం, శ్రీవారు నన్ను అడ్డుకోవటం నిముషంలో జరిగిపోయింది.

శ్రీవారు గబగబా నానిగాడిని ప్రక్కగదిలోకి తీసుకొనివెళ్ళి కాగితాలు వాడి చేతికిచ్చి, "నువ్వు ఏమిచేశావో చెప్పు. నిన్ను కొట్టనులే" అంటూ బుజ్జగించారు. నానిగాడు వెక్కిళ్ళమధ్య నెమ్మదిగా "మరేమో! అమ్మ కథ రాస్తుంది. కథకు నాపేరు పెట్టమంటే పెట్టనంది. నా పేరు పుస్తకంలో పడితే మా క్లాసులోగొప్పగా చెప్పుకోవచ్చని ఒక కథ వ్రాశాను.

"ఏమని వ్రాశావు నానీ?"

"నేను వాళ్ళ టామీని గురించి వ్రాశాను." (మా వాడికి కుక్కలంటే ప్రాణం. రోజూ కుక్కపిల్లని పెంచుదామని గోల. వీడి గోలతోనే చస్తున్నాం ఇంకా దాని గోలెందుకని నేనే వాడి ముద్దు తీర్చలేదు.)

"కథవ్రాసి ఏమి చేశావు?"

"మరేమో పత్రికకు ఎలా పంపించాలో తెలియదుగా, అమ్మ నడుగుతే కోప్పడుతుందని భయము వేసింది. అందుకని ఆ రోజు నువ్వు కథరాసి కవరులో పెట్టి. కవరు అంటించేదా, లేక నువ్వు ఒకసారి చూసి అంటిస్తావా అని అడుగుతూ అమ్మదగ్గరకు వెళ్ళినప్పుడు కవరులోంచి ఆ కాగితాలు తీసి, నేను రాసిన కాగితాలు పెట్టాను. నువ్వేమో మళ్ళీ చూడకుండా అంటించి పోస్టులో వేశావు" అంటూనే బావురుమన్నాడు. వాడి తెలివికి నవ్వాలో ఏడవాలో తెలియలేదు. "కవరులో పెట్టిన కాగితాలు ఎక్కడ పెట్టావురా?"

ఆ కాగితాలు విడిగా నీకు కనిపిస్తే తెలుసుకుంటావని, బాయిలర్‌లో వేశాను. నన్ను కొట్టకమ్మా" వెక్కుతూనే చెప్పాడు. నానిగాడి తెలివికి నోట మాట రాలేదు.

మొత్తానికి రచయిత్రి కొడుకుననిపించావు. కాగితాలు పోతే పోయ్యాయిలే. ఆ కథ మీ అమ్మకు బైహార్టు అయి వుంటుంది. మళ్ళీ వ్రాయవచ్చులె"మ్మంటూ పెద్దగా నవ్వారు శ్రీవారు. *